సాక్షి వికారాబాద్

సోమవారం, 24, జూన్, 2024



కాడెద్దులు కనుమరుగు

దుక్కి దున్నాలన్నా.. విత్తనాలు వేయాలన్నా పండించిన పంట ఇంటికి చేరాలన్నా ఒకప్పుడు కాడెద్దులు కావాల్సిందే. 10లో▸



ఒండ్రుతో వ్యాపారమా!

చెరువు మట్టిని కొందరు అక్రమార్కులు ఇటుక బట్టీలకు తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారు. 10లో▸



భవనం సరే.. వైద్యులేరి?

నూతన పీహెచ్‌సీలో సరిపడా వైద్య సిబ్బంది లేక.. మెరుగైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేస్తాం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



ముఖ్యమంత్రికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు ప్రతీ పేదింటికి చేరేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో కలెక్టర్ ఆదివారం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని ప్రతీక్‌జైన్ సీఎంకు చెప్పారు.

ఉత్తమ సేవా పతకానికి ఇద్దరు పోలీసులు



అబ్దుల్ హఫీజ్



రాజశేఖర్

అనంతగిరి: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందిచిన ఎస్ అబ్దుల్ హఫీజ్, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఏఎస్ఐ రాజశేఖర్ ప్రభుత్వం అందజేస్తున్న ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికయ్యారని ఎస్పీ నారాయణ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పతకాలు సాధించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ ప్రకటన చేయంతో ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా రుణమాఫీ చేయకుండా మాటలు చెబుతూ రైతులను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రుణమాఫీ, రైతులకు సబ్సిడీ పథకాలు అందాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పార్థసారథి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేస్తాం

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్



లక్నోలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న చంద్రశేఖర్ తదితరులు

తాండూరు టౌన్: రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతమే లక్ష్యమని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నిర్వహించిన బీఎస్పీ జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పార్టీ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాలపై గంజా పంజా

గ్రామాల్లోనూ గంజాయి పంజా విసురుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించినా.. పోలీసులు సోదాలు చేస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు.
గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తూ యువతను బానిసలుగా మారుస్తోంది.

- వ్యసనాలకు బానిసవుతున్న యువత
- ఆకతాయిలుగా మారి హల్‌చల్
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పోలీసులు నిఘా పెంచాలని కోరుతున్న ప్రజలు

మున్సిపాలిటీల్లో పెరుగుతున్న బాధితులు



పోలీసులు సీజ్ చేసిన గంజాయి (ఫైల్)

వికారాబాద్: జిల్లాలో గంజాయి ఉపయోగిస్తున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఈ వ్యసనం ఐదారేళ్ల క్రితమే ఈ ప్రాంతంలో పురుడు పోసుకున్నా ఇటీవల శృతిమించింది. గంజాయి తీసుకుంటున్న యువత, విద్యార్థులు ఆకతాయిల అవతారమెత్తుతున్నారు. మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియకుండా పోతోంది. అక్కడక్కడ వెలుగుచూస్తున్న ఘటనలతో తల్లిదండ్రుల కంటికి కునుకు కరువవుతోంది. ఏడాది క్రితం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు వెల్లిబుచ్చిన ఆవేదన అప్పట్లో కలకలం రేపిన విషయం విదితమే. ఇటీవల పరిగిలో ఓ వెంచర్ నిర్వాహకుడు ఇక్కడ గంజాయి సేవించొద్దని మందలిస్తే.. ఆ యువకులు వెంచర్‌లో నల్లాలకు ఏర్పాటు చేసిన పైపులు ధ్వంసం చేశారు. వికారాబాద్ సమీంపలోని మూసీనదిపై ఉన్న రైల్వే బ్రిడ్జి పరిసరాలు గంజాయి తీసుకునేవారికి అడ్డాగా మారిందని పట్టణవాసులు వాపోతున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇటీల గంజాయి, డ్రగ్స్, తదితర మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో అదే తరహాలో జిల్లాలోనూ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. గ్రామాల్లో మద్యానికి, గంజాయిలాంటి వాటికి బానిసలైన యువత బాలికలను వేధించడం తరచూ చైల్డ్‌లైన్ దృష్టికి వస్తున్నట్లు పేర్కొంటున్నారు.

పల్లెలకు పాకిన వ్యసనం

గంజాయి సేవిస్తున్న యువత, విద్యార్థుల సంఖ్య పెరిగిపోతోంది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ లాంటి మున్సిపాలిటీల్లో వేయి మందికి పైగా వ్యసనానికి అలవాటుపడినట్లు నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. గ్రామాల్లోనూ యువత గంజాయి బారిన పడుతున్నారని ఆయా గ్రామాల పెద్దలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు.. ఏదైనా సంఘటన వెలుగు చూసినప్పుడు, ఎన్నికల కోడ్ లాంటి సమయాల్లో హావుడి చేయడం తప్ప వీటి కట్టడికి చర్యలు తీసుకోకపోవడంతో వీరి సంఖ్య పెరిగిపోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నిర్వహించిన తనిఖీల్లోనే 25 కిలోలకు పైగా గంజాయి పట్టుబడింది. కొద్ది రోజుల వ్యవధిలోనే 20 కిలోలకు పైగా పట్టుబడిందంటే సాధారణ సమయంలో ఇంకా ఎంత పెద్ద మొత్తంలో రవాణా ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రైలు మార్గంలో భారీ ఎత్తున తరలిస్తున్న గంజాయిని ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ గంజాయి

నిఘా వ్యవస్థపై విమర్శలు

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి రవాణా అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన సమయంలో దొరికిన వారిపై కేసులు నమోదు చేసి వదిలేయడం తప్ప వారికి ఎవరు.. ఎక్కడ నుంచి సప్లై చేస్తున్నారు? తదితర కోణాల్లో విచారణ జరగటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిఘా సంస్థలు, వ్యవస్థలు విఫలమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న స్పీకర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తదితరులు

మెగా జాబ్ మేళా సక్సెస్

- 70 కంపెనీలు ఐదు వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు
- ప్రారంభించిన ప్రసాద్ కుమార్, సునీతారెడ్డి



మేళాకు హాజరైన యువత

అనంతగిరి: నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జెడ్పీచైర్ పర్సన్ పి.సునీతారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 70 కంపెనీలు 5వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

నూతన పరిశ్రమల ఏర్పాటు

అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఇప్పటికే 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని.. మరో లక్షా 70వేల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి ప్రణాళికలు రచిస్తున్నారని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితో వృద్ధిలోకి వచ్చేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఎన్నికల హామీలతో పాటుగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. మెగా జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. దేశానికి యువతే వెన్నుముక అన్నారు. పరిగి శాసనసభ్యులు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత విద్యతోపాటు ప్రతిభను మెరుగుపరచుకోవాలన్నారు. యువత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు భరోసాగా ఉండాలన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంతోష, మేనేజర్ వేణుగోపాల్ రావు, జెడ్పీ సీఈఓ సుధీర్, డీవైఎస్ఓ హనుమంతరావు, సీనియర్ నాయకులు కిషన్ నాయక్, ఎర్రవల్లి జాఫర్, రమేశ్ కుమార్, షరీఫ్, వెంకట్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఎరువుల బస్తాలు

సీజన్ షురూ

- వానాకాలం సాగు పనుల్లో రైతులు
- ఎరువులు, విత్తనాలకు డిమాండ్
- 'రైతు భరోసా'కు ఎదురుచూపులు

ఎరువులు	ధరలు
డీఏపీ	రూ.1,350
కాంప్లెక్స్	రూ.1,150
గ్రోమోర్	రూ.1,700
10.26.26	రూ.1,470

విత్తనాలు	ధరలు
కంది(కిలో సంచి)	రూ.280
పెసర(కిలో సంచి)	రూ.200
జొన్నలు(3కేజీల సంచి)	రూ.550
పత్తి(450గ్రా.)	రూ.850
వరి(బస్తా)	రూ.850

కొడంగల్: ఏరువాక ముగిసింది. మృగశిర కార్తెతో వానాకాలం పంటల సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కురిస్తే విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఎరువులు, విత్తనాల కొనుగోలుకు డిమాండ్ పెరిగింది. ఎరువులు, విత్తనాల ధరల పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. విత్తనాలతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు సైతం మండుతున్నాయి. రైతన్నలకు సాగు ఖర్చులు పెరిగాయి. పెట్టుబడి పెట్టలేక ఎరువులు కొనలేక ఇబ్బందులు తప్పడం లేదు. విత్తనాలు వేసే సమయం దగ్గర పడుతున్నా రైతు బంధు రాలేదని ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిసి విత్తనాలు వేసే సమయానికి రైతు భరోసా నగదు వస్తే ఒకింత భారం తగ్గేదని రైతులు చర్చించుకుంటున్నారు.

పెట్టుబడి సాయానికి..

సాగు పెట్టుబడి కోసం గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రైతు భరోసా కింద ఏడాది ఎకరాకు రూ.15వేల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. ఇప్పటికే మంత్రి వర్గ ఉప సంఘం విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. కానీ ఓ వైపు విత్తనాలు వేయడం, మార్కెట్‌లో ఎరువుల ధరల చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరితగతిన పెట్టుబడి సాయం అందితే ఆసరా ఉండేదని చర్చలు వినిపిస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలో వానాకాలం సీజన్‌లో 50వేల హెక్టార్లకు పైగా సాగు చేసే అవకాశం ఉంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నాణ్యతా ప్రమాణాలను బట్టి ధరలున్నాయి.

సాగు ఖర్చులు పెరిగాయి

గత ఏడాది కంటే ఈ సంవత్సరం సాగు ఖర్చులు పెరిగాయి. కూలీల రేటుతో పాటు ఎరువులు, విత్తనాల ధరలు అధికంగా ఉన్నాయి. ఎరువులు కొనడానికి రైతులకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం సాగు ఖర్చుల కోసం రైతు భరోసా ఇస్తే భారం తగ్గుతుంది. సీజన్ ప్రారంభమైనందున త్వరితగతిన డబ్బు జమ చేయాలి.

– హన్మంతు, రైతు, కొడంగల్

చినుకు కునుకు కరువు

- ఊరించి.. ఉసూరుమనిపించి
- ముఖం చాటేసిన వరుణుడు
- ముందస్తుగా సాగు చేసిన పంటలు ఎండుముఖం
- ఆకాశంకేసి అన్నదాతల చూపులు



వర్షాలు లేక వాడిపోతున్న పత్తి మొక్కలు

షాబాద్: వర్షాకాలం ప్రారంభమైనా జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కూడా పడలేదు. వరుణుడు కరుణించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఆశలతో పంటల సాగుకు సిద్ధమై అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. పుడమితల్లి పులకించేలా వర్షం కురవకపోవడంతో పంటలు వేసేందుకు ఆలోచిస్తున్నారు. భూగర్భ జలాలు ఉన్న రైతులు కొందరు ముందస్తుగా పంటలు సాగు చేశారు. వర్షాలు పడితే పంటలకు ఇబ్బంది ఉండదనుకున్న వారికి నిరీక్షణే మిగిలింది. ఆరుద్రకార్తె ప్రారంభమైనా వర్షం కురవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండుతాయని ఆశించిన వారి ఆశలు అడియాసలు అవుతున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు అందులో సగం మేర కూడా నారుమడులు పోయలేదు. గతేడాది మృగశిర కార్తె నుంచే వర్షాలు కురవడంతో దాదాపు జూన్ మధ్య వరకు ఆరు తడి పంటలను విత్తడం పూర్తయింది. ప్రస్తుతం వరుణుడి కటాక్షం లేకపోవడంతో జూన్ నెల చివరి వరకు వచ్చిన పంటలు విత్తడం సగం కూడా కాలేదు.

నీరుపోయని బోరు మోటార్లు

జిల్లాలో బోరుబావుల ఆధారంగా కొంతమంది రైతులు ముందస్తుగా రోహిణి కార్తె ప్రారంభం నుంచే పంటలు విత్తడం ప్రారంభించారు. ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. ఉన్న నీటికి వర్షాలు తోడైతే పంటలు మొలకెత్తుతాయని రైతులు ఆశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ భానుడి ప్రతాపం తగ్గకపోవడంతో నాటిన విత్తనాలు మొలకెత్తడం లేదు. కొందరు రైతులు పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వానలు లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో పత్తి మొలకెత్తే అవకాశం లేదంటున్నారు.

మేఘాలు కమ్ముకుంటున్నా..

వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రోజూ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అప్పటికప్పుడు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుందేమోనన్న పరిస్థితి ఏర్పడుతోంది. అంతలోనే గాలులు వీస్తుండడంతో మేఘాలు తేలిపోతున్నాయి. రోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. వర్షాలు కురుస్తాయని రైతులు ఆకాశంవైపు చూడడం.. అంతోనే మేఘాలు ముఖం చాటేయడంతో నిరాశ చెందుతున్నారు.

వర్షాలు కురవాలి వాన దేవుడా



షాబాద్ మండలం తాళ్లపల్లిలో కప్పాట ఆడుతున్న గ్రామస్తులు

'వర్షాలు కురువాలి ఓ వాన దేవుడా అంటూ' మహిళలు పాటలు పాడుతూ కప్పాట ఆడుతున్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ఆదివారం మహిళలు, చిన్న పిల్లలు ఓ రోకలికి కప్ప, వేపకొమ్మలను కట్టి ఇంటింటికీ తిరుగుతూ పాటలు పాడారు. వానలు కురవాలని దేవుడిని ప్రార్థించారు.


ఆశతో పత్తి వేశా..



20 రోజుల క్రితం కురిసిన వర్షానికి పది ఎకరాలల్లో పత్తి పంట సాగు చేశాను. వానలు పడతాయని ఆశతో పంట వేశాను. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో విత్తిన పత్తి పూర్తిగా మొలకెత్తుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం, షాబాద్ మండలం

వానాకాలం ప్రారంభమైనా..



వానాకాలం ప్రారంభమైనా వానలు పడడం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో సకాలంలో విత్తనాలు విత్తలేక పోతున్నాం. ఇప్పటివరకు పత్తి, జొన్న, మొక్కజొన్న పంటలు విత్తడం పూర్తి కావాలి. వానలు లేక నిత్యం ఆకాశం వైపు చూస్తున్నాం.

– అసిగారి బాల్‌రాజ్, రైతు తాళ్లపల్లి, షాబాద్ మండలం

మినిమం స్కేల్ ఇవ్వండి

మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఆంజనేయులు

చేవెళ్ల: తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు ఆదివారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, గౌరవ అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి జీఓ 254 ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేస్తున్నారని వివరించారు. మన రాష్ట్రంలో కూడా మినిమం టైం స్కేలు అమలు చేసేందుకు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకులంగా స్పందించారని వివరించారు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

యాలాల: మండల పరిధిలోని సంగెంకుర్దు శివారులో ఉన్న సంగమేశ్వరాలయంలో కొడంగల్ మహాదేవుని ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి జగదీశ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, లింగార్చనం, శివ అష్టోత్తర శతనామస్మరణతో పూజలు చేశారు. అనంతరం నైవేద్య సమర్పణ, మంగళహారతి కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో భజనమండలి సభ్యులు తదితరులు ఉన్నారు.

బాధితుడికి పరామర్శ



యాదయ్యగౌడ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్ ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కమిటీ నియామకం



నూతన ప్రతినిధులు

అనంతగిరి: స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కమిటీని ఆదివారం నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వదేశీ స్వావలంబన రాష్ట్ర సభ జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మహిళా కన్వీనర్‌గా సుజాత, కో కన్వీనర్‌గా కుర్వ వెంకటేశ్, నియోజకవర్గ కన్వీనర్‌గా గొండ్ల సురేష్‌గౌడ్, పరిగి కన్వీనర్‌గా ఘనపురం భూపాల్‌రెడ్డి, వికారాబాద్ పట్టణ కన్వీనర్‌గా డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, నవాబ్‌పేట మండల కన్వీనర్‌గా శ్యాముదిరాజు, పూడూర్ మండల కన్వీనర్‌గా ప్రేమ్‌కుమార్‌లను నియమించామని జిల్లా కన్వీనర్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

12 మూగజీవాలు మృత్యువాత

షాద్‌నగర్‌రూరల్: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 జీవాలు మృత్యువాత పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని కాశిరెడ్డిగూడ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట చెన్నయ్య గొర్రెలను మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం గొర్రెల మందను తన వ్యవసాయ పొలం వద్ద పాకలో కొట్టి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం చెన్నయ్య కుమారుడు శ్రీశైలం మంద వద్దకు వెళ్లి చూడగా.. అందులో కొన్ని గొర్రెలు చనిపోయి చల్లా చెదురుగా పడి ఉన్నాయి. మరికొన్ని గొర్రెలపై కుక్కలు దాడి చేస్తుండగా గమనించి వాటిని తరిమి కొట్టాడు. ఈ దాడిలో పది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న చెన్నయ్య పొలం వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించాడు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వెటర్నరీ వైద్యుడు శ్రీధర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెన్నయ్యను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిద్రమాత్రలు మింగిన దంపతులు

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా భర్త మరణించాడు, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీ నగర్‌కు చెందిన రవీందర్‌కుమార్ (56) రాఖీ (49) భార్యాభర్తలు. రవీందర్‌కుమార్ ప్రైవేటు సంస్థలో పని చేస్తుండగా కొద్ది రోజుల నుంచి ఖాళీగా ఉంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 20న రాణిగంజ్‌లోని వసుంధర లాడ్జిలో భార్యాభర్తలు బస చేశారు. ఈ నెల 21వ తేదీన రాత్రి ఇద్దరూ లాడ్జిలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 22వ తేదీ ఉదయం రూంబాయ్ వచ్చి తలుపు కొట్టగా ఎలాంటి స్పందన కనిపించ లేదు. లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవీందర్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కాడెద్దులు కనుమరుగు



సత్తార్‌కుంట తండాలో ఎద్దులతో విత్తనాలు వేస్తున్న రైతులు



హార్వేస్టర్‌తో వరి కోస్తున్న దృశ్యం

- ట్రాక్టర్లు, హార్వెస్టర్లతో వ్యవసాయ పనులు
- ఖర్చు తక్కువ.. సమయం ఆదా
- ఆదరణ కోల్పోతున్న ఎడ్ల బండ్లు

దుద్యాల్ : ఒకప్పుడు దుక్కి దున్నలన్నా.. విత్తు విత్తలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా కాడెద్దులు.. ఎద్దుల బండి కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. ప్రస్తుతం ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కాడెద్దులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. చూద్దామన్నా కానరాని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాల్లో ఒకరిద్దరి వద్ద కాడెద్దులు కనబడుతున్నా అవి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దులు, బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి. రానురాను అంతరించిపోయే ప్రమాదం లేకపోలేదు.

అందుబాటులో ఆధునిక యంత్రాలు

ప్రస్తుతం మార్కెట్లో ఆధునిక యంత్రాలు విచ్చలవిడిగా అందుబాటులో ఉన్నాయి. ఎన్నో ప్రైవేట్ కంపనీలు వ్యవసాయానికి అవసరమయ్యే ఆధునిక యంత్రాలను తయారు చేసి మార్కెట్లో అమ్ముతున్నారు. నాగళ్లు, రూటావేటర్, కల్టివేటర్, గోర్రు, గునుక, లెవలింగ్ యంత్రం, హార్వేస్టర్ వంటి ఎన్నో యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో వ్యవసాయానికి పనికి వచ్చే యంత్రాలను కొనుగోలు చేసి ట్రాక్టర్ల సహాయంతో పొలం పనులు కొనసాగిస్తారు. యంత్రాలను కొనేవారు పెరిగిపోవడంతో ఎద్దుల నాగలితో దుక్కిదున్నే కాలం కనుమరుగయ్యింది.

గతంలో భలే గిరాకీ..

గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు ఎద్దులు, బండ్లు సిద్ధం చేసుకునేవారు. వాటికి మంచి గిరాకీ ఉండేది. సాగుకు అవసరమైన పనులు చేయించుకునేందుకు రైతులు ఎద్దులు నాగలి ఉన్న వారిని ముందుగానే మాట్లాడుకుని ఈ రోజు మా దగ్గరకు రావాలి అని అడ్వాన్స్ కూడా ఇచ్చేవారు. దీనితో పాటు కూలీలకు కూడా పనులుండేవి. ఇప్పుడు కేవలం కలుపుతీయడానికి, పురుగు మందులు చల్లడానికి తప్పితే కూలీలకు పనులు ఉండడం లేదని రైతులు చెబుతున్నారు.

గిరిజన తండాలోనే ఎక్కువ

దుద్యాల్ మండలంలో ఎక్కువగా గిరిజన తండాలు ఉన్నాయి. ఇప్పటికీ కొందరు వ్యవసాయ పనులు కాడెద్దులతో చేస్తున్నారు. దుక్కులు దున్నడం మాత్రమే యంత్రాలతో చేస్తారు. విత్తనం వేయడం, రొప్పడం, మొలకెత్తిన తరువాత సాళ్ల మధ్యలో రిక్య పట్టడం వంటి పనులు ఎద్దులతోనే చేస్తున్నారు.

ఒండ్రుతో వ్యాపారమా!



తయారు చేసిన ఇటుక బట్టీలు

- పొలానికి వేయాల్సిన ఒండ్రు ఇటుక తయారీకి..
- చెరువులో ఉంటే రైతులకు ఉపయోగం



ఆలేడ్ సమీపంలో నిల్వ ఉంచుకున్న ఒండ్రు మట్టి

దుద్యాల్: చెరువులో నుంచి తీసిన ఒండ్రు మట్టిని పొలాలకు వినియోగిస్తే నేలలు సారవంతమవుతాయి. పంటలకు బలంగా ఉంటుంది. కానీ, కొందరు అదే ఒండ్రుతో వ్యాపారం చేస్తూ లభాలు గడిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలం పరిధి ఆలేడ్ సమీపంలో చెరువుల నుంచి మట్టిని తెచ్చి ఇటుకల వ్యాపారి డంపు చేసుకుంటున్నాడని పేర్కొన్నారు. గ్రామ చెరువుల నుంచి తీసుకొచ్చి వ్యాపారాలకు చేసుకోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆలేడ్‌వాసులు, రైతులు అవసరం ఉన్న వరకు వినియోగించుకుని మిగతా చెరువులోనే ఉంటే తరువాత పంటలకు వినియోగించుకోవచ్చని అంటున్నారు. కాని, చెరువుల నుంచి ఒండ్రును తీసుకొచ్చి వ్యాపారాలు చేసుకోవడంపై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

స్టార్టప్ కంపెనీని ప్రారంభిస్తా



చందును సన్మానిస్తున్న రవినాయక్, చిత్రంలో విద్యార్థి తల్లిదండ్రులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ చందునాయక్

శంకర్‌పల్లి: ప్రముఖ ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీటు సంపాదించి, స్టార్టప్ కంపెనీని ప్రారంభించడమే లక్ష్యమని జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా 407 ర్యాంకు సాధించిన సభావత్ చందునాయక్ అన్నారు. మండలంలోని మోకిల తండాకి చెందిన శంకర్, దేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. శంకర్ సెంట్రింగ్ పని చేస్తుండగా, దేవి వ్యవసాయ కూలీ. చందునాయక్ చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండడంతో తల్లిదండ్రులు యూసఫ్‌గూడలోని సోషల్ వెల్ఫేర్‌లో పదో తరగతి వరకు చ దివించారు. అనంతరం కుమారుడి ఆసక్తిని గమనించిన దంపతులు పేదరికాన్ని సైతం లెక్కచేయకుండా కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. ఇంటర్మీయట్‌లో 966 మార్కులు సాధించగా.. ఇటీవల ప్రకటించిన జేఈఈ ఫలితాల్లో ఏకంగా 407 ర్యాంకుని సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఆదివారం చందునాయక్‌ని స్థానిక అడ్వొకేట్ వర్త్య రవినాయక్ సన్మానించి, ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి

- విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించండి
- మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతిపత్రం



మంత్రి జూపల్లితో నాయకులు

మాడ్గుల: విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ మాడ్గుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఎంతో మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నడిపే విజయ డెయిరీలో ప్రతి రోజు పాలు విక్రయిస్తున్నారన్నారు. బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయడంతో పాటు 15 రోజులకోసారి పాల బిల్లులు వచ్చేలా డైయిరీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ సాయిరెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆర్టీఐ అధికార ప్రతినిధి నియామకం



అశోక్‌గౌడ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌యాదవ్

యాచారం: మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది వృత్తిలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం విశేష కృషి చేస్తున్నందుకు శ్రీనివాస్‌యాదవ్‌కు ఈ పదవి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

కత్తితో దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

తాండూరు టౌన్ : ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ధన్‌గర్ గల్లీకి చెందిన కురువమహేశ్, సాయిపూర్‌కు చెందిన మిస్కిన్ దేవరాజ్‌ను మాట్లాడే పని ఉందని అంబేద్కర్ చౌక్‌కు రమ్మన్నాడు. అక్కడికి చేరుకున్న దేవరాజ్, మహేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. మాటా మాటా పెరగడంతో ఆవేశానికి లోనైన మహేశ్ కొబ్బరి బోండాల కత్తితో దేవరాజ్‌పై దాడి చేయగా, అతని కుడిచేతికి గాయమైంది. ఈ మేరకు దేవరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థి అదృశ్యం



ప్రతీక్ (ఫైల్)

శంషాబాద్: తండ్రి మందలించడంతో విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన మేరకు.. పట్టణంలోని నక్షత్ర కాలనీలో నివాసముండే డాక్టర్ రాజేష్ కుమారుడు ప్రతీక్ (13) జీఎంఆర్ చిన్మయ విద్యాలయంలో 8 తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లో గొడవ పడుతున్నాడని తరగతి ఉపాధ్యాయుడు ప్రతీక్ తండ్రిని శనివారం స్కూల్‌కు పిలిపించి చెప్పాడు. ప్రతీక్‌ను ఇంటికి వచ్చిన తర్వాత తండ్రి మందలించాడు. సాయంత్రం కరాటే క్లాస్‌కు వెళ్తున్నానని చెప్పి బయలుదేరిన రాత్రి వరకు తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తల్లీపిల్లల అదృశ్యం

శంషాబాద్ రూరల్: తల్లీ, పిల్లలు అదృశ్యమైన ఘటన పెద్దతూప్రలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన దిద్యాల యాదయ్య ఈ నెల 19న ఉదయం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే వరకు ఇంట్లో భార్య మమత, కుమారుడు భానుప్రసాద్(10), కూతురు వైష్ణవి (7) కనిపించలేదు. వారి ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికినా లభించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి విద్యుత్ సబ్‌స్టేషన్

- తీరనున్న 10 గ్రామాల ప్రజల
- కరెంట్ కష్టాలు
- లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం



జినుగుర్తిలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్

తాండూరు రూరల్: తాండూరు మండలం జినుగుర్తి సమీపంలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ త్వరలో అందుబాటులోకి రానుంది. సబ్‌స్టేషన్ లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించారు. ఎట్టకేలకు గత అసెంబ్లీ ఎన్నికల ముందు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యుత్‌శాఖ మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేసి సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మండల పరిధిలోని జినుగుర్తి సమీపంలోని ప్రభుత్వ భూమిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్‌ను విద్యుత్‌శాఖ మంజూరు చేసింది. ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు వెచ్చించింది. సబ్‌స్టేషన్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు త్వరలో పూర్తయ్యే అవకాశం ఉంది.

గతంలో కోటబాసుపల్లి నుంచి..

గతంలో జినుగుర్తితో పాటు 10 గ్రామాలకు కోటబాసుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. సబ్‌స్టేషన్‌లో ఏదైన సమస్య తలెత్తితే జినుగుర్తితో పాటు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. దీంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా ఉల్లిపంట సాగు చేసే రైతులు సతమతమయ్యేవారు.

తీరనున్న కష్టాలు..

జినుగుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే జినుగుర్తితండా, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, ఉద్దాండపూర్, మైసమ్మతండా, గుండ్లమడుగుతండా, వీరారెడ్డిపల్లి, రాంపూర్, అల్లాపూర్, సిరిగిరిపేట్‌లోని గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరనున్నాయి. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సబ్‌స్టేషన్ పూర్తయితే ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంది.

అందుబాటులోకి తెస్తాం



జినుగుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా పూర్తి చేస్తాం. సబ్‌స్టేషన్ పనులు పూర్తయి త్వరలో అందుబాటులోకి వస్తోంది. దీంతో 10 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి.

–వెంకట్‌నాయుడు, విద్యుత్ ఏఈ, తాండూరు మండలం

స్పీకర్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ మంజూరు



చెక్కు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: కిడ్నీ సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థినికి ఆదివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రూ.లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఆకాంక్ష రెండేళ్ల క్రితం కిడ్నీ సమస్యతో ఆస్పత్రిలో చేరగా రూ.2లక్షల ఖర్చయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ చెక్కు అందలేదు. విషయాన్ని కాంగ్రెస్ నాయకులు స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవ తీసుకుని రూ.లక్ష మంజూరు చేయించారన్నారు. ఈ చెక్కును ఆదివారం స్పీకర్ ఆకాంక్షకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బుజ్జయ్యగౌడ్, బాబాఖాన్, కిరణ్‌కుమార్, ఎల్.అశోక్, టి.మల్లేశ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

బంట్వారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే, అస్సెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో రూ.2.30లక్షలకు ఎల్‌ఓసీ అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కొండిగారి చంద్రయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఎంపీపీ ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శంకర్‌యాదవ్, నాయకులు సిద్ధి రాములు స్వామి, శ్రీనివాస్, యాదగిరి, వెంకటేశం, నర్సింలు, రజనీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశమైన కురుమ సంఘం నాయకులు

కురుమ సంఘం డిమాండ్

తాండూరు టౌన్ : ఆలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని తాండూరు కురుమ సంఘం నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కురుమలు 40 లక్షల వరకు ఉన్నారని, కురుమ సామాజిక వర్గం అభ్యున్నతికి తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించడంలో కురుమలు ముఖ్యభూమిక పోషించారన్నారు. కురుమల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కురుమ సంఘం నాయకులు జగదీష్, గౌడి వెంకటేశం, మల్లేశం, నర్సింహులు, హన్మయ్య, పూజారి పాండు, పల్లె వెంకటయ్య, భీమయ్య, కిష్టప్ప, రాఘవేందర్, తదితరులు కోరారు.

పెళ్లి కావడంలేదని.. పెట్రోల్ పోసుకొని..

వ్యక్తి ఆత్మహత్య



కిరణ్‌కుమార్ (ఫైల్)

మొయినాబాద్: పెళ్లి కావడంలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన చేవెళ్ల కిరణ్‌కుమార్(40) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఆయనకి ఇంకా పెళ్లి కాలేదు. తన సోదరులకు సైతం వివాహం కాలేదు. అనారోగ్య కారణంతో పాటు పెళ్లి కావడంలేదని కొంత కాలంగా ఆయన మదనపడేవారు. కాగా ఆదివారం ఉదయం ఇంట్లో చిన్న గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిరణ్‌కుమార్ బాటిల్లో పెట్రోల్ తెచ్చుకుని తమ ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. వేగంగా మంటలు వ్యాప్తిచడంతో పూర్తిగా కాలిపోయి అక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే సమావేశం వాయిదా



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు భారీగా చేరుకున్న లబ్ధిదారులు

- కాంగ్రెస్ పార్టీ నిరసనతో పోలీసుల ముందస్తు చర్యలు
- పడిగాపులు కాసిన ఇళ్ల లబ్ధిదారులు

మహేశ్వరం: మండలంలోని మన్సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు భవన సముదాయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సబితారెడ్డితో ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడింది. ఆదివారం సభను నిర్వహించేందుకు రెండు పడకల ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాట్లు చేయగా అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు 'చలో మన్సాన్‌పల్లి'కి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇరుపార్టీలు ఘర్షణకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసులు ఎమ్మెల్యే సబితారెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు నోటీసులు ఇచ్చారు. ఇరువర్గాలు మన్సాన్‌పల్లికి వెళ్లవద్దని సూచించారు. దీంతో పోలీసులు డబుల్ బెడ్ రూమ్స్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయింది.